

సంక్షేమంలో సాటి.. లాభాల్లో మేటి

- ఉద్యోగ నియామకాల్లో మొదటిస్థానం
- ఉద్యోగులకు బీమా భరోసా
- కాంట్రాక్టు కార్మికులకూ లాభాల వాటా
- ఈయేడు ఉత్పత్తిలో వెనుకంజ



ఇన్సూరెన్స్పై బ్యాంకు నిర్వాహకులతో ఒప్పందం పత్రం మార్చుకుంటున్న సీఎండీ (ఫైల్)



ఎస్టీపీపీలో మిథేన్ ఉత్పత్తి ప్లాంటు

శ్రీరాంపూర్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ కార్మికుల సంక్షేమం... లాభాల లక్ష్య సాధనలో కృషి చేస్తోంది.. ఉద్యోగావ కాశాలు, పర్యావరణ పరిరక్షణ, వైద్య సదుపా యాలు కల్పిస్తోంది.. నూతన విద్యుత్ ప్రాజెక్టుల వైపు దూసుకెళ్తోంది.. అయితే గతేడాది కంటే ఈసారి బొగ్గు ఉత్పత్తిలో వెనుకబడింది.

రిటైర్ అయిన కార్మికులకు సీపీఆర్ఎంఎస్ పథకంలో భాగంగా 9వేల 78 మెడికల్ కార్డులు జారీ చేశారు. వీటి ద్వారా ఆయా కుటుంబాలు వైద్య సదుపాయం పొందుతు న్నాయి. ఉద్యోగులకు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నారు. పరీక్షలు నిర్వహించేందుకు ఏరియాలోని ఆర్కే 8, నస్పూర్ డిస్పెన్సరీలలో అధునాతన పరికరాలు ఏర్పాటు చేశారు. మహిళలకు కేన్సర్ అవగాహన శిబిరాలు, నిర్ధారణ, నివారణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఆర్కే 8 డిస్పెన్సరీలో ఫిజియోథెరపీ సెంటర్ ఏర్పాటు చేసి ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు ఫిజియోథెరపీ సేవలందిస్తున్నారు. కాంట్రాక్టు కార్మికులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితిని ఆన్లైన్లో నమోదు చేస్తున్నారు. భవిష్యత్తులో వారికి అవసరమైన వైద్య సేవలు అందించే ఏర్పాట్లు చేస్తున్నారు. ఆర్వో ప్లాంట్ల ద్వారా కార్మికుల కుటుంబాలకు తాగునీరు అందిస్తున్నారు. సూపర్బజార్ల ద్వారా గ్యాస్, నిత్యావసర సరుకులు అందిస్తున్నారు.

ఉద్యోగావకాశాలు

ఈ ఏడాదిలో పర్సనల్ విభాగం ద్వారా శ్రీరాంపూర్ ఏరియాలో 3 వేల 578 మంది యువతీ, యువకులకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు అందించారు. ఎక్స్టర్నల్ నోటి ఫికేషన్ల ద్వారా పరీక్షలు నిర్వహించి ఆరుగురు ఫిట్టర్ ట్రైనీ, ఆరుగురు ఎలక్ట్రికల్ ట్రైనీ, ఒక అసిస్టెంట్ ఫోర్మెన్ ట్రైనీ పోస్టులు ఇచ్చారు. ఇటీవల గ్రాడ్యుయేట్ ట్రైనీ(మైనింగ్) అభ్యర్థులు ఎక్స్టర్నల్ విధానంలో నియామకం కాగా, శ్రీరాంపూర్ ఏరియాకు 22 మందిని కేటాయించారు. సంస్థలో పనిచేసిన ఉద్యోగి కుటుంబాల వారు ఉద్యోగం వద్దనుకున్నందుకు నియమ, నిబంధనల ప్రకారం 253 మందికి ఏకమొత్తం అందించారు. 15 మందికి ఎంఎంసి (నెల నెలా) డబ్బులు అందించే ఏర్పాట్లు చేశారు.

రక్షణ మొదటి ప్రాధాన్యం

ఏరియాలో రక్షణకు మొదటి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ నెల 9వ తేదీ నుంచి 25వ తేదీ వరకు 55వ రక్షణ పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సమావేశాల ద్వారా ప్రతి గనిలో కమిటీల ద్వారా రక్షణ సూత్రాలు, వాటి అమలు, వ్యక్తిగత రక్షణ పరికరాల వినియోగంపై అవగాహన కల్పించారు. 2017 కోల్మైన్స్ రెగ్యులైజేషన్ యాక్టు ప్రకారం రెండేళ్లకోసారి ఎస్ఓపీలను తయారు చేసి డీజీఎంఎస్ అనుమతితో అమలు పరుస్తున్నారు. రక్షణ విభాగంలో ఏరియాకు 14 అవార్డులు వచ్చాయి. స్టార్ రేటింగ్ అధికారులు ఆర్కే న్యూటెక్ గనిని ఎంపిక చేసుకొని ఇటీవల సందర్శించారు. వచ్చే నెలలో నిర్ణయం వెలువడనుంది.

మిగతా 7లో

వెలుగులందిస్తున్న ఎస్టీపీపీ

జైపూర్లోని 1200 మెగావాట్ల సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ సంస్థకు లాభాల పంట పండిస్తోంది. ఇటీవల మరో 800 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తికి సంబంధించిన మూడో యూనిట్ను ప్రారంభించేందుకు సన్నాహాలు చేపట్టారు. 2010లో రెండు యూనిట్ల నిర్మాణానికి శంకుస్థాపన జరుగగా, 2017 నుంచి విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించింది. ప్లాంటులో బొగ్గును మండించడం ద్వారా ఉత్పత్తి అయ్యే 500 కేజీల పరిమాణం గల కార్బన్డైయాక్సైడ్ను సేకరించి దాని ద్వారా 180 కేజీల మిథనాల్ ద్రవాన్ని తయారు చేసేందుకు అధికారులు ప్రయోగాత్మక ప్రక్రియ చేపట్టనున్నారు. ఇథనాల్ను ఎరువులు, అక్రిలిక్ ప్లాస్టిక్, సింథటిక్ ఫైబర్ వస్త్రాలు, ప్లైవుడ్, పెయింట్స్ తయారీలో విస్తృతంగా వినియోగిస్తారు.

సోలార్ పవర్ ఉత్పత్తిలో ఎస్టీపీపీ ముందంజలో ఉంది. మొత్తం 25 మెగావాట్ల విద్యుత్ను ఈ విధానంలో ఉత్పత్తి చేస్తున్నారు. 10 మెగావాట్ల ప్రాజెక్టును నేలపై, 5 మెగావాట్ల ప్లాంటు నీటిపై తేలియాడే పలకల ద్వారా ఉత్పత్తి చేస్తున్నారు. నీటిపై మరో 10 మెగావాట్ల విద్యుత్ను తయారు చేసేందుకు పనులు జరుగుతున్నాయి. చెన్నూర్లోనూ 11 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు.

థర్మల్ విద్యుత్ కేంద్రంలో 16 వేల బొగ్గు వినియోగిస్తుండగా, దానిని మండించడం ద్వారా సల్ఫర్, కార్బన్, లెడ్ వంటి ప్రమాదకర వాయువులు వెలువడుతున్నాయి. వాటి ప్రభావాన్ని తగ్గించడానికి ఎఫ్జీడీ(ఫ్లూగ్యాస్ డీసల్ఫరైజేషన్) యూనిట్ను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో 2 వేల మిల్లీ గ్రాములు వెలువడే సల్ఫర్డైయాక్సైడ్ 200 మిల్లీగ్రాములకు తగ్గనుంది. అంతేకాకుండా సిమెంట్ కంపెనీల్లో వాడే జిప్సం ఈ విధానంలో తయారీ కావడంవల్ల సింగరేణికి ఆదాయం సమకూరుతోంది.



పెరిగిన నేరాలు

- ఈ ఏడాది 1207 కేసులు నమోదు
- కలకలం రేపిన జైనూరు ఇరువర్గాల ఘర్షణ
- మహిళలపై పెరిగిన అఘాయిత్యాలు
- పెరిగిన పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసులు
- సామాజికసేవలో పోలీసులు

6

సమాజ సేవలో 'జనహిత'

- 150 మంది సభ్యులతో ముందుకు
- దాతల సహకారంతో కార్యక్రమాలు

7



సేవా సంస్థ ఆధ్వర్యంలో మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న సభ్యులు (ఫైల్)

ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



రాఖీలు కట్టి నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

శ్రీరాంపూర్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షా అభియాన్(ఎస్ఎస్ఏ) ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన సమ్మె ఆదివారం 20వ రోజుకు చేరింది. కలెక్టరేట్ ఎదుట శిబిరంలో ఉద్యోగులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాస్క్ ధరించగా, మహిళా ఉద్యోగులు వారికి రాఖీలు కట్టారు. సీఎంను సోదరుడిగా భావించి రాఖీలు కట్టామని, ఇప్పటికైనా తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథరావు సమ్మె శిబిరంలో మద్దతు తెలిపారు. కృష్ణమూర్తి, స్వామిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నాలుగో తరగతి ఉద్యోగుల కార్యవర్గ సమావేశం



మౌనం పాటిస్తున్న నాలుగో తరగతి ఉద్యోగులు

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా నాలుగో తరగతి ఉద్యోగుల కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు గీట్ల సుమిత్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. మాజీ ప్రధాని మన్మోహన్సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మౌనం పాటించారు. అనంతరం సమావేశంలో నాలుగో తరగతి ఉద్యోగుల ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్లో ఉన్న పీఆర్సీ అమలు చేయాలని, బిల్లులను క్లియర్ చేయాలని కోరారు. ప్రధాన కార్యదర్శి గోవర్ధన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రపంచ తెలుగు మహాసభల్లో జిల్లా కవికి పురస్కారం



పురస్కారంతో కవి మహేందర్

చెన్నూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో జరుగుతున్న 6వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభల్లో జిల్లాకు చెందిన కవులు బొడ్డు మహేందర్, మేకల రామస్వామి, దబ్బెట రాజమల్లు, తాళ్ల సురేష్, మామిడి అక్షితలు పాల్గొన్నారు. పర్యావరణంపై జరిగిన కవి సమ్మేళనంలో బొడ్డు మహేందర్కు పర్యావరణ కవి పురస్కారం లభించింది. మంచిర్యాల జిల్లా రచయితల సంఘం తరుపున మేకల రామస్వామి, అఖిల భారతీయ సాహి త్య పరిషత్ తరుపున దబ్బెట రాజమల్లులు భాషాభివృద్ధి సాంకేతిక మార్పుల గురించి సదస్సుల్లో చర్చించారు.

విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటం



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

బెల్లంపల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాడుతామని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దాగం శ్రీకాంత్ అన్నారు. ఆదివారం పట్టణంలో ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ వేడుకల కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. 1970లో ఎస్ఎఫ్ఐ ఏర్పడిందని, విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తుందని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగ సమస్యల పరిష్కారంలో విఫలమయ్యాయని ఆరోపించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు నిఖిల్, పాముల అక్షయ్, మంజునాథ్, సాయి, సాయికిరణ్, రాజశేఖర్లు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి



అభ్యాసకులకు సూచనలు ఇస్తున్న ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ అశోక్

దండేపల్లి, డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): ఓపెన్స్కూల్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ ఎస్.అశోక్ అన్నారు. దండేపల్లి ఉన్నత పాఠశాలలో తరగతులను ఆదివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఓపెన్ స్కూల్లో ఉత్తీర్ణత సాధించిన వారు రెగ్యులర్ పది, ఇంటర్తో సమానమన్నారు. ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందవచ్చన్నారు. ఈనెల 30లోగా ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు తాత్కాల్ ద్వారా ఆన్లైన్లో చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్లో జరిగే వార్షిక పరీక్షలకు అభ్యాసకులు ఇప్పటి నుంచే సిద్ధం కావాలన్నారు. సహాయ కోఆర్డినేటర్ సంగర్స్ రాజేశ్వర్రావు, ఉపాధ్యాయులు కొండు జనార్దన్, రామన్న, చెట్టుపల్లి రమేష్, అభ్యాసకులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు పార్టీది త్యాగాల చరిత్ర



సమావేశంలో మాట్లాడుతున్న కలవేన శంకర్, ర్యాలీ నిర్వహిస్తున్న కార్యకర్తలు

శ్రీరాంపూర్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీది త్యాగాల చరిత్ర అని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్ అన్నారు. సీపీఐ ఆవిర్భవించి శత వసంతంలోకి అడుగిడుతున్న సందర్భంగా శ్రీరాంపూర్లో పలు కార్యక్రమాలు నిర్వహించారు. శంకర్ మాట్లాడుతూ దున్నే వాడికి భూమి అనే నినాదంతో 1925 డిసెంబరు 26న కాన్పూర్లో ఆవిర్భవించిన సీపీఐ అనేక యోధుల త్యాగాలతో అంచెలంచెలుగా ఎదిగిందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచి, ఆదరణ పొందుతుందన్నారు. తెలంగాణలో 10 లక్షల ఎకరాలను పేద ప్రజలకు పంచిన చరిత్ర పార్టీదని పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ పార్టీ పోటీలో ఉంటుందని, ప్రజలు ఆదరించాలని కోరారు. అనంతరం పార్టీ సీనియర్ నాయకులు ఆళ్ల లచ్చిరెడ్డి, నూకల రాజయ్య, జక్కుల రాజయ్య, కంచం పోషం, జాలిగం సంపత్లను సన్మానించారు. సీపీఐ కార్యవర్గ సభ్యుడు కారుకూరి నగేష్ కృష్ణకాలనీ కార్యాలయం వద్ద, జిల్లా సమితి సభ్యుడు చిలుక రాంచందర్ ఆధ్వర్యంలో పార్టీ జెండాలను ఎగుర వేశారు. సాయంత్రం కొత్తరోడ్డు నుంచి కటిక దుకాణాల వరకు ర్యాలీ నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, సింగాపూర్ కార్యదర్శి రామన్న, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మేకల దాసు, నాయకులు ముష్కె సమ్మయ్య, బాజీసైదా, లింగం రవి, రేగుంట చంద్రకళ, మోత్కూరి కొమురయ్య, నర్సింగారావు, రవీందర్, రాజేశ్వర్రావు పాల్గొన్నారు.

ఘనంగా సీపీఐ వందేళ్ళ వేడుకలు

తాండూర్, (ఆంధ్రజ్యోతి): తాండూర్ మండల కేంద్రంలో ఆదివారం సీపీఐ వంద సంవత్సరాల వేడుకలను నాయకులు నిర్వహించారు. ఐబీలోని ఆంధ్రాబ్యాంకు నుంచి భగత్ సింగ్ భవన్ వరకు ర్యాలీ నిర్వహించి జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. మండల కార్యదర్శి సాలిగామ సంతోష్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, సభ్యులు చంద్రశేఖర్, దాగం మల్లేష్, బొంతల లక్ష్మీనారాయణ, పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న సీపీఐ నాయకులు

చప్రాలకు ప్రారంభమైన భక్తుల పాదయాత్ర



పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

గర్మిళ్ల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాలోని ఐబీ చౌరస్తాలో గల భక్తాంజనేయ స్వామి దేవాలయం నుంచి ఆదివారం దత్తావతార కార్తీక్ మహారాజ్ చప్రాడ పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్ర రెబ్బెన, టోంకిని మీదుగా ఈ నెల31న సాయంత్రం మహారాష్ట్రలోని పారు. 35 మందికి పైగా భక్తులు కాలినడకన బయల్దేరారు. నూతన సంవత్సరం రోజు చప్రాలలో యేటా పూజలు నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు. పాదయాత్ర వల్ల ప్రశాంతతో పాటు, ఆరోగ్యం చేకూరుతున్నాయని వారు తెలిపారు. హనుమాన్ మందిర్ ప్రశాంత్ధాం వరకు సాగనుందని భక్తులు తెలిపారు. పాదయాత్రలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బెల్లంపల్లి, (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని చప్రాల హనుమాన్ మందిర్ ప్రశాంత్ధాంకు భక్తులు పాదయాత్రగా వెళ్లారు. భక్తుల పాదయాత్ర మంచిర్యాల నుంచి బెల్లంపల్లికి చేరుకుంది. నల్గొండ జిల్లా సూర్యాపేటకు చెందిన భక్తులు 2016 నుంచి మంచిర్యాల నుంచి చప్రాల వరకు పాదయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు.

జాతీయ స్థాయి యోగా పోటీల్లో రాణించాలి



యోగా, కరాటే పోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్పర్సన్ జక్కుల శ్వేత, ఎస్హెచ్వో దేవయ్య

బెల్లంపల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి యోగా పోటీల్లో రాణించాలని మున్సిపల్ చైర్పర్సన్ జక్కుల శ్వేత, వన్టౌన్ ఎస్హెచ్వో దేవయ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆర్యవైశ్య భవన్లో జాతీయ స్థాయి యోగా, కరాటే పోటీలను వారు ప్రారంభించి మాట్లాడారు. యోగాతో ఏకాగ్రత, కరాటేతో ఆత్మస్థైర్యం పెరుగుతుందన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. యోగా, కరాటే పోటీలను నిర్వహించారు. నాయకులు కారుకూరి రాంచందర్, బండి ప్రభాకర్, చిలుముల శంకర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

మాదిగ హక్కుల దండోరాలో చేరికలు



మాదిగ హక్కుల దండోరాలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న నాయకులు

బెల్లంపల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్సీ కమ్యూనిటీ హాలులో ఆదివారం జరిగిన మాదిగ హక్కుల దండోరా సమావేశంలో పలువురు ఎంఆర్పీఎస్ నాయకులు చేరారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిలుక రాజనర్సు ఆధ్వర్యంలో ఎంఆర్పీఎస్ సీనియర్ నాయకులు కుశనపల్లి రాజలింగు, గోగర్ల శేఖర్, కాంపల్లి సతీష్, మెరుగు స్వామి, ఇప్ప నరేష్లు మాదిగ హక్కుల దండోరాలో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. పట్టణాధ్యక్షుడు శివాజీ, రమేష్, దుర్గయ్య, రాజం, రాజ్కుమార్, నవీన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ కార్యవర్గం

తాండూర్, (ఆంధ్రజ్యోతి): మాదారం ఎమ్మార్పీఎస్ కమిటీని ఆదివారం జిల్లా అధ్యక్షుడు చెన్నూరు సమ్మయ్య ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సముద్రాల ఆనంద్, ఉపాధ్యక్షుడిగా రాంచందర్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, దాసరి బానయ్య, శ్రీకాంత్లను ఎన్నుకున్నారు. కృష్ణ, లక్ష్మణ్, సుధాకర్, కమలాకర్, పాల్గొన్నారు.

ఘనంగా వినోద్ మిశ్రా వర్ధంతి

జన్నారం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఆదివారం సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి వినోద్ మిశ్రా వర్ధంతిని నాయకులు నిర్వహించారు. జిల్లా కార్యదర్శి కనికరపు లక్ష్మీకాంత్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెంకటేష్, లక్ష్మీ, రవి, శారద, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గర్మిళ్ల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పాత మంచిర్యాల విద్యుత్ సబ్స్టేషన్లో మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డివిజనల్ ఇంజనీర్ ఎంఎం ఖైసర్, పట్టణ ఏడీ వేణుగోపాల్, రూరల్ ఏడీఏ మోహన్ రెడ్డిలు ఒక ప్రకటనలో తెలిపారు. రాంనగర్, ఏసీసీ, వేంపల్లి, నస్పూర్ సబ్స్టేషన్ల పరిధిలోని వార్డుల్లో విద్యుత్ ఉండదని తెలిపారు.

ఎస్టీపీపీలో నిలిచిన విద్యుత్ ఉత్పత్తి

జైపూర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్లోని యూనిట్ 1లో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. బాయిలర్ ట్యూబ్ లీకేజీ కారణంగా ఆదివారం అధికారులు ఉత్పత్తి నిలిపివేసి మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

జన్నారం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కవ్వాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త షాకీర్ అలీ తండ్రి అమీర్ హుస్సేన్ మృతి చెందాడు. ఆదివారం నిర్వహించిన అంత్యక్రియల్లో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పాల్గొని పార్థివ దేహానికి నివాళులర్పించారు. ముజాఫర్ అలీ, పసివుల్లా, రియాజుద్దీన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

WANTED

★ Wanted M.Sc. Nursing/B.Sc. Nursing Faculty to work as Part Time/Full Time in SRKM College of Nursing, mancherial, Contact: 8374585229, 9866509614

AJK-201848

ఫ్లాట్ అమ్మబడును

★ మంచిర్యాల పట్టణంలోని హైటెక్ సిటీ కాలనీ నందు ఏషియన్ టవర్స్ ప్రక్కన, అరుణ్ అపార్ట్ మెంట్నందు సెకండ్ ఫ్లోర్లోని ఫ్లాటు అమ్మబడును కావల్సినవారు సంప్రదించగలరు. సెల్: 8008033178

AJK-201847

3+2 స్కీం కలదు

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడీవీటీ

క్లాసిఫైడ్ ప్రకటనలకు సంప్ర : మంచిర్యాల
సెల్ : 99854 11038, 99854 03314

క్లాసిఫైడ్ ప్రకటనలకు సంప్ర : కాగజ్నగర్
సెల్ : 99854 08147

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

రెబ్బెన, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం కొండపల్లి బస్‌స్టాప్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బాబురావు(50) మృతి చెందినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. కొండపల్లికి చెందిన బాబురావు అదే గ్రామంలోని బస్‌స్టాప్ వద్ద రోడ్డు దాటుతుండగా, కైరిగాం వైపు వెళ్లతున్న పికప్‌వాహనం ఢీకొట్టింది. దీంతో బాబురావు తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అదుపు తప్పి కారు బోల్తా : ఒకరికి గాయాలు

బెల్లంపల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల నుంచి బెల్లంపల్లి వైపు వస్తున్న కారు ఆదివారం కాల్‌టెక్స్ ఫ్లైఓవర్ బ్రిడ్జిపైకి వెళ్తున్న క్రమంలో స్తంభాన్ని ఢీకొని బోల్తా పడింది. పట్టణంలోని ఇంక్లైన్ బస్తీకి చెందిన తిరుపతి పని నిమిత్తం మంచిర్యాలకు వెళ్లి తిరిగి వస్తుండగా కారు బోల్తా పడింది. కారు నడుపుతున్న తిరుపతికి తీవ్ర గాయాలయ్యాయి. బోల్తా పడిన కారును స్థానికులు సరిచేసి తిరుపతిని బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబీకులు మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

పేలిన ఆర్టీసీ బస్సు టైరు : తప్పిన ప్రమాదం

బెల్లంపల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి నుంచి ఆసిఫాబాద్ వైపు వెళ్తున్న ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు ఆదివారం ఏఎంసీ క్రీడా మైదానం వద్దకు రాగానే టైరు పేలిపోయింది. ఒక్కసారిగా భారీ శబ్దం రావడంతో బస్సులో ఉన్న ప్రయాణికులతోపాటు వాహనదారులు ఉలిక్కిపడ్డారు. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది. ఎప్పుడు రద్దీగా ఉండే క్రీడా మైదానం ఎదుట బస్సు టైరు పేలడంతో వాహనదారులు, ప్రజలు ఉలిక్కిపడ్డారు. అనంతరం ప్రయాణికులను మరో బస్సులో తరలించారు. టైరు పేలిన సమయంలో పరిమితికి మించి ప్రయాణికులు ఉన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు

తాండూర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తాండూర్‌కు చెందిన గట్టు రాజయ్య అనే వృద్ధుడు కనిపించడం లేదని ఎస్‌ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. రాజయ్యకు మతిస్థిమితం లేదు. ఆరు నెలల క్రితం ఇంటి నుంచి వెళ్లి ఇప్పటి వరకు రాలేదని తెలిపారు. వృద్ధుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 8712656575కు తెలపాలని సూచించారు.

సోషల్‌మీడియాలో పోస్టులపై ఫిర్యాదు

తాండూర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అచ్చలాపూర్ గ్రామానికి చెందిన రత్నం తార కేశెట్టి మల్లక్క భూ తగాదా విషయంలో గట్టు మురళీధర్‌రావు పాత్ర ఉన్నట్లు కొందరు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు ఆదివారం తాండూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. భూమి విషయంలో అధికారులు దర్యాప్తు చేస్తే విషయాలు బయట పడతాయన్నారు. అసత్య ప్రచారం చేసిన తాళ్లపల్లి చంద్రశేఖర్, ఎస్ఎస్‌జీ మీడియా యూట్యూబ్ చానల్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

రెండు కలప దుంగలు స్వాధీనం

దండేపల్లి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న రెండు కలప దుంగలను సిబ్బంది పట్టుకున్నట్లు తాళ్ళపేట అటవీ రేంజ్ అధికారి సుష్మరావు తెలిపారు. నాగసముద్రం శివారులో కడెం కాలువ అవతల అటవీ ప్రాంతం నుంచి అనుమానాస్పదంగా ఓ వ్యక్తి రెండు కలప దుంగలను తరలిస్తుండగా గమనించిన డిప్యూటీ రేంజ్ అధికారి సాగరిక, ఎఫ్‌బీవో రహిముద్దీన్, బేస్ క్యాంపు సిబ్బందిని వెంబడించగా కలప దుంగలను పడేసి పారిపోయాడు. కలప దుంగలను అటవీ రేంజ్ కార్యాలయానికి తరలించారు. వీటి విలువ సుమారు రూ. 5,649 ఉంటుందని పేర్కొన్నారు.

బెల్ట్‌షాపుపై నిర్వాహకుడిపై కేసు

నెన్నెల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్న వెంకటాపూర్‌లో బెల్ట్‌షాపుపై ఆదివారం దాడి చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. కిరాణషాపులో మద్యం విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడి చేసినట్లు పేర్కొన్నారు. అమ్మకానికి సిద్ధంగా ఉన్న మద్యాన్ని స్వాధీనం చేసుకొని నిర్వాహకుడు గౌస్‌పాషపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

అనారోగ్యంతో టీడీపీ నాయకుడి మృతి


మనోహర్ (ఫైల్)

కాసిపేట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాసిపేట గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కార్యవర్గసభ్యుడు కమాన్ మనోహర్ (55) హైద్రాబాద్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మనోహర్ నెల రోజులుగా ఊపిరి తిత్తుల వ్యాధితో బాధపడుతుండగా కుటుంబీకులు రోజుల క్రితం హైద్రాబాద్‌కు తరలించారు. పరిస్థితి విషమించి ఆదివారం తెల్లవారుజామున మృతిచెందాడు. సోమవారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

ఆరిజన్ డెయిరీ నిర్వాహకుడిపై దాడి

బెల్లంపల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆరిజన్ డెయిరీ నిర్వాహకుడు ఆదినారాయణపై ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. ఆదినారాయణతో పాటు సుధాకర్ అనే వ్యక్తి బజార్ ఏరియాలోని రామాటాకీస్ ప్రాంతంలో ఉండగా గుర్తు తెలియని వ్యక్తులు వారిపై దాడి చేశారు. దాడిలో ఆదినారాయణకు గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చే సరికి దాడి చేసిన వ్యక్తులు పరారయ్యారు. గాయపడిన ఆదినారాయణను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నిరుపేదలకు సేవ చేయడమే లయన్స్‌క్లబ్ లక్ష్యం

జైపూర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదలకు సేవ చేయడమే లయన్స్‌క్లబ్ లక్ష్యమని రామగుండం లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మల్లికార్జున్, సీనియర్ సభ్యుడు గంగాధర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేయనున్న లయన్స్‌క్లబ్ ఉద్దేశ్యాలు, లక్ష్యాలను ఆదివారం సమావేశంలో వివరించారు. నిరుపేదలను గుర్తించి ఆర్థికంగా ఆదుకోవడం, పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించడం, నిరుపేదలకు కంటి ఆపరేషన్‌లు చేయించడం ఉద్దేశ్యమన్నారు. సభ్యులు సల్ల సత్యనారాయణ, రాజబాపురెడ్డి, అంబాల రవీందర్‌రెడ్డి, మంతెన లక్ష్మణ్, ముదం రమేష్, జక్కుల వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఎరువులు పంపిణీ

కోటపల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కేంద్రియ మెట్ట వ్యవసాయ పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో ఎస్సీ సబ్ ప్లాన్ కింద ఆదివారం ఆల్గామలోని రైతులకు జింకు, సేంద్రియ ఎరువులను మాజీ సర్పంచు కుమ్మరి సంతోష్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ రైతులు సేంద్రియ ఎరువును ఉపయోగించి భూసారాన్ని పెంపొందించాలన్నారు.

సరుకుల అందజేత

కాసిపేట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అచ్యుతరావుగూడెంలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఆత్రం సత్తుబాయి ఇల్లు పూర్తిగా కాలిపోయింది. సామాజిక కార్యకర్త ఎంబడి కిషన్, యువకులు మెస్రం రంజిత్‌కుమార్ స్పందించి ఆదివారం సత్తుబాయికి సరుకులు, దుస్తులు, దుప్పట్లు, బ్లాంకెట్లు అందజేశారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. జనార్దన్, విశ్వాస్, కృష్ణ, నితిన్, పద్మశంకర్, బాపు, పాల్గొన్నారు.

పెరిగిన నేరాలు



- ఈ ఏడాది 1207 కేసులు నమోదు
- కలకలం రేపిన జైనూరు ఇరువర్గాల ఘర్షణ
- మహిళలపై పెరిగిన అఘాయిత్యాలు
- పెరిగిన పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసులు
- సామాజికసేవలో పోలీసులు

2023లో కేసుల వివరాలు		2024లో కేసుల వివరాలు..	
హత్య కేసులు	22	హత్య కేసులు	12
ఆస్తి సంబంధిత కేసులు	109	ఆస్తి సంబంధిత నేరాలు	82
నేర పూరిత నరహత్యలు	5	నేరపూరిత హత్యలు	3
దొమ్మి కేసులు	5	దొమ్మికేసులు	4
కిడ్నాప్ కేసులు	24	కిడ్నాప్‌కేసులు	14
రేప్ కేసులు	27	రేప్ కేసులు	24
ఎస్సీ, ఎస్టీ కేసులు	24	ఎస్సీ, ఎస్టీ కేసులు	34
పోక్సో కేసులు	20	పోక్సో కేసులు	27
గంజాయి కేసులు	17	గంజాయి కేసులు	39
సైబర్ నేరాల కేసులు	26	సైబర్ నేరాల కేసులు	21
మహిళలపై అఘాయిత్యాల కేసులు	177	మహిళలపై అఘాయిత్యాల కేసులు	188


జైనూరు మండలంలో ఇరువర్గాల ఘర్షణలో తగులబడుతున్న వాహనం(ఫైల్)

ఆసిఫాబాద్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రశాంతతకు మారుపేరు గాంచిన ఆసిఫాబాద్ ఏజెన్సీలో క్రమంగా నేరాలశాతం పెరుగుతోంది. సాంకేతికపరిజ్ఞానం పెరుగుతున్నా.. నేరాలను అదుపు చేయడం పోలీసులకు సవాళుగా మారుతోంది. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది నేరాల శాతం కాస్తంత పెరిగింది. 2023లో 1063కేసులు నమోదు కాగా ఈ ఏడాది 1207 కేసులు నమోదయ్యాయి. 2023తో పోలిస్తే 2024లో జిల్లాలో నేర ప్రవృత్తి పెరిగింది. జిల్లా పరిధిలో ఈ ఏడాది 1207 కేసులు నమోదయ్యాయి. 2023 సంవత్సరంలో జిల్లాపరిధిలో 1063కేసులు నమోదు కాగా ఈ ఏడాది వాటికంటే 144కేసులు ఎక్కువగా నమోదయ్యాయి.


పట్టుకున్న గంజాయితో ఎస్పీ డీవీ శ్రీనివాసరావు(ఫైల్)

గత సంవత్సరంతో పోల్చితే హత్య కేసులు 45.4శాతం, ఆస్తి సంబంధిత నేరాలు 24.7శాతం, నేరపూరిత హత్యలు 40శాతం తగ్గాయి. దొమ్మి కేసులు 20శాతం, కిడ్నాప్ కేసులు 20శాతం, రేప్ కేసులు 11.1శాతం,సైబర్ నేరాలు 32శాతం, తగ్గాయి. ఎస్సీ, ఎస్టీ నేరాలు 41.6శాతం, పోక్సో కేసులు 35 శాతం, మహిళలపై అఘాయిత్యాలు 6.2శాతం, గంజాయి కేసులు 129.4శాతం పెరిగాయి. జిల్లాలో ఈ ఏడాది 133రోడ్డు ప్రమాదాల్లో 60మంది మృతిచెందగా 91మంది గాయపడ్డారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది 1.6శాతం రోడ్డు ప్రమాదాలు తగ్గాయి. ఈ ఏడాది 82ఆస్తి సంబంధిత నేరాలలో రూ.62.08 లక్షలు విలువగల నగదు, ఆభరణాలు ఇతర వస్తువులు దొంగతనం కాగా 37 కేసులను గుర్తించి రూ.15.33 లక్షలను రికవరీ చేశారు. జిల్లాలో గతేడాదితో పోలిస్తే సైబర్ నేరాలు తగ్గాయి. ఈ ఏడాది అన్ని కేసులు కలిపి 48మందికి శిక్షలు పడేలా చేశారు. ఈ ఏడాది లోక్‌అదాలత్‌ల ద్వారా 2378 కేసులను రాజీకు దర్పడంతో పరిష్కారమయ్యాయి. పీడీఎస్ అక్రమ రవాణాపై 100కేసులు నమోదుచేసి 170మందిని అరెస్టు చేసి 1221.8క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేశారు. గేమింగ్ యాక్టు, జూదం కింద 151 కేసుల్లో 605 మందిపై కేసులు నమోదుచేసి రూ. 4.83 లక్షలను సీజ్ చేశారు. జిల్లాలో 39 అక్రమ గంజాయి కేసులను నమోదుచేసి 65మందిని అరెస్టుచేసి 298.855 కిలోల, 121గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. 45పశువుల అక్రమ రవాణా కేసులు నమోదుచేసి 130మంది నిందితులను అరెస్టుచేసి 628పశువులను రక్షించారు. 1290 డ్ర కెన్‌డ్రైవ్ కేసులలో 63,628 ఈ చాలన్ల ద్వారా రూ.1.13కోట్ల జరిమానాలు విధించారు.

కలకలం రేపిన ఇరువర్గాల ఘర్షణ..

జిల్లాలోని ఏజెన్సీ మండలాల్లో ఈ ఏడాది ఇరువర్గాల మధ్య ఘర్షణ కలకలం రేపింది. జైనూరు మండలంలో ఆదివాసీ మహిళపై మక్దూం అనే వ్యక్తి అత్యాచారయత్నం, హత్యాయత్నానికి పాల్పడటంతో ఏజెన్సీ నివురుగప్పిన నిప్పుల మారింది. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చెలరేగి జైనూరు మండల కేంద్రంలో వ్యాపార వాణిజ్య సముదాయాలు కాలి బుడిదయ్యాయి. పోలీసు ఉన్నతాధికారులు జైనూరులోనే మకాంవేసి పరిస్థితులను ఎప్పటికప్పుడు అదుపులోకి తీసుకువచ్చారు. ఏజెన్సీ మండలాల్లో ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. 144సెక్షన్ అమలులో పెట్టి పరిస్థితిని చక్కదిద్దడానికి నెలరోజుల సమయం పట్టింది.

సామాజిక సేవలో పోలీసులు..

జిల్లాలో మావోయిస్టులపై అదుపునకు జిల్లాపోలీసు యంత్రాంగం గట్టి చర్యలు చేపట్టింది. జిల్లాలో నిత్యం పోలీసులు పెట్రోలింగ్, వాహనాల తనిఖీలు, కూంబింగ్ ఆపరేషన్ కారణంగా జిల్లాలో మావోయిస్టుల కార్యకలపాలు తగ్గుముఖంపట్టాయి. ప్రధానంగా కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలు జిల్లాలో మావోయిస్టు కార్యకలపాల పతనానికి దోహద పడ్డాయని చెప్పుకోవచ్చు. జిల్లాలోని ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో పోలీసింగ్‌పై కళాజాతా బృందాలతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు, స్పోర్ట్స్ కిట్లు, దివ్యాంగులకు వీల్ చైర్‌లు, మహిళలకు ఉచితంగా కుట్టు మీషన్లను, నిరుపేదలకు నిత్యావసర సరుకులు, దుప్పట్లు, రగ్గులు పంపిణీ చేశారు. హెల్త్ క్యాంపులను నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు.

పోస్టుమెట్రిక్ హాస్టల్ లేక తంటాలు

- ఇబ్బందులు పడుతున్న ఎస్సీ, ఎస్టీ బాలురు
- నిత్యం సొంత గ్రామాల నుంచి రాకపోకలు
- ఉన్నతాధికారులు స్పందిస్తే మేలు



కాగజ్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల

కాగజ్‌నగర్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో చదువుకుంటున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు హాస్టల్ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం కాగజ్‌నగర్‌లో బీసీ బాలికల, బాలుర, ఎస్సీ బాలికల, ఎస్టీ బాలికల పోస్టుమెట్రిక్ హాస్టల్స్ ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీ బాలురకు హాస్టల్ వసతిలేదు. ఇక్కడ డిగ్రీ చదువుకునేందుకు జైనూరు, నార్నూరు, సిర్పూరు(యు), కెరమెరి, ఆసిఫాబాద్, వాంకిడి, సిర్పూరు(టి), కౌటాల, పెంచికల్‌పేట, చింతలమానేపల్లి తదితర మండలాలకు చెందిన విద్యార్థులు వస్తుంటారు. నిత్యంగ్రామాల నుంచి రాకపోకలు చేయడం విద్యార్థులకు చాలా కష్టంగా మారుతోంది. కొంత మంది విద్యార్థులు గ్రామాల నుంచి కాలేజీకి రావడం ఇబ్బందిగా గమనించి ఇక్కడే అద్దె గదుల్లో ఉంటూ చదువుకుంటున్నారు. ఆర్థిక స్తోమత లేని విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు. కొందరు మధ్యలోనే చదువును ఆపేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి పోస్టుమెట్రిక్ హాస్టల్ ఏర్పాటు చేయాలని ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు, విద్యార్థి సంఘం నాయకులు డిమాండు చేస్తున్నారు.

హాస్టల్ సౌకర్యం కల్పించాలి..



-అన్నం నాగార్జున, విద్యార్థి సంఘం నాయకుడు

కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుకునేందుకు ఎస్టీ, ఎస్సీ విద్యార్థుల కోసం పోస్టుమెట్రిక్ హాస్టల్ వసతి సౌకర్యం లేదు. దీంతో విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జైనూరు, నార్నూరు, సిర్పూరు(యు), కెరమెరి, ఆసిఫాబాద్, వాంకిడి, దహెగాం తదితర మండలాల నుంచి ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు చదువుకోవడానికి వస్తుంటారు. వీరంతా నిత్యం ఆర్టీసీ, ప్రయివేటు వాహనాల ద్వారా కాలేజీకి రావాల్సిన పరిస్థితి ఉంది. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని అధికారులు వెంటనే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు హాస్టల్ ఏర్పాటు చేయాలి.

గుంతలరోడ్డుకు మరమ్మతులు

దహెగాం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): కల్వాడ గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలమయం కావడంతో ఆదివారం గ్రామానికి చెందిన యువకులు మరమ్మతులు చేయించారు. గుంతల్లో మొరం పోసి ఎక్స్‌కావటేర్‌తో చదును చేయించారు. రోడ్డును బాగు చేయడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిర్మించారు.. నిర్లక్ష్యంగా వదిలేశారు

- 15ఏళ్లుగా ప్రారంభానికి నోచుకోని పాఠశాల, అంగన్‌వాడీ భవనం


చెట్ల పొదల మధ్య ప్రారంభానికి నోచుకోని పాఠశాల భవనం

సిర్పూర్(టి), డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): పదిహేనేళ్ల క్రితం కుమరం భీం ప్రాజెక్టులో భూములు కోల్పోయిన నిర్వాసితులకు లక్షలు వెచ్చించి మండలకేంద్రంలో జ్యోతి నగర్ కాలనీ నిర్మాణం చేపట్టారు. వారి పిల్లల విద్యాభ్యాసం కోసం పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం భవనాలు నిర్మించారు. అయితే సంబంధిత శాఖాధికారులు వాటిని వినియోగంలోకి తేలేదు. దీంతో కాలనీకి చెందిన భూనిర్వాసితులు ఈ భవనాల వరండాల్లో పశువుల మేత, వ్యవసాయానికి సంబంధించిన సామగ్రిని దాచుకోవడానికి ఆయా నిర్మాణాలను వినియోగించుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి భవనాలను వినియోగంలోకి తీసుకురావాలని కాలనీప్రజలు కోరుతున్నారు.


ప్రారంభానికి నోచుకోని అంగన్‌వాడీ భవనం

ప్రారంభించక పోవడంపై విచారణ జరుపుతాం..

- వేణుగోపాల్, ఎంఈవో

భూ నిర్వాసితుల పిల్లల కోసం జ్యోతినగర్‌లో నిర్మించిన పాఠశాల, అంగన్‌వాడీ భవనాలు ప్రారంభించక పోవడంపై విచారణ జరుపుతాం. వాటిని వినియోగంలోకి తెచ్చేలా కృషి చేస్తాం.

ఏఐటీయూసీ బ్రాంచ్ మీడియా కార్యదర్శిగా రాజ్‌కుమార్

శ్రీరాంపూర్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ మీడియావిభాగం కార్యదర్శిగా ఆర్కే7గనికి చెందిన జాడి రాజ్ కుమార్ నియమితులయ్యారు. ఆర్కే న్యూటెక్ గనికార్యదర్శిగా రవీందర్, ఆర్కే5గని కార్యదర్శిగా నాగరాజు, ఆర్కే6 కార్యదర్శిగా నగేష్, ఎస్ఆర్పీ3 కార్యదర్శిగా ఆడెపు సురేష్, ఎస్ఆర్పీ1 కార్యదర్శిగా రాజు, ఐకే1ఏ కార్యదర్శిగా జయసూర్య, శ్రీరాంపూర్ ఓసీపీ కార్యదర్శి అమీర్‌పాషా, రాజశేఖర్‌ను నియమించారు. అనంతరం మీడియా లోగోను యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వి సీతారామయ్య, రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె రాజ్ కుమార్ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ, యూనియన్ బలోపేతానికి మీడియా సహకరించాలని సూచించారు. త్వరలో అన్ని డివిజన్లలో మీడియా విభాగాన్ని విస్తృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉప ప్రధానకార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, అక్బర్‌అలీ, శ్రీరాంపూర్ బ్రాంచ్‌కార్యదర్శి బాజీసైదా, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.



మీడియా లోగోను ఆవిష్కరిస్తున్న సీతారామయ్య, రాజ్‌కుమార్



హక్కుల సాధనే ఐఎన్‌టీయూసీ లక్ష్యం

మందమర్రిటౌన్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కుల సాధనే ఐఎన్‌టీయూసీ లక్ష్యమని ఆ యూనియన్ కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు దేవిభూమయ్య పేర్కొన్నారు. ఆదివారం ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో ఏరియా ముఖ్యనాయకుల, కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ కార్మికులకు చేసిందేమీ లేదన్నారు. గుర్తింపు సంఘంతో కొత్తగూడెంలో నిర్వహిం చిన స్ట్రక్చర్ సమావేశంలో కార్మికుల సమస్యలు ప్రస్తావించకపోవడం శోచనీయమన్నారు. నూతన గనులు, ఉపాధి అవకాశాల పెంపుకోసం తమ నేత జనక్‌ప్రసాద్ నేతృత్వంలో సీఎం దృష్టికి తీసుకువెళ్లనున్నామని తెలిపారు. ఇప్పటికే బాయిబాటలో కార్మికుల సమస్యలు సేకరించామని, ఇకపై పోరుబాట పడతామని తెలిపారు. అనంతరం ఇటీవల మృతిచెందిన మాజీ ప్రధానిమన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో నరేందర్, వెంకటస్వామి, శంకర్‌రావు, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలుకు కృషి చేస్తాం

- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి సీతారామయ్య

శ్రీరాంపూర్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా కార్మికులకు ఇచ్చిన హామీల అమలుకు కృషి చేస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి సీతారామయ్య, కార్యదర్శి కె రాజ్‌కుమార్ అన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలోని అన్ని గనులు, విభాగాల పిట్ కమిటీ, మైన్స్ కమిటీ, సేఫ్టీకమిటీ, టెంపుల్‌కమిటీ, క్యాంటీన్‌కమిటీ, ట్రేడ్స్‌మెన్, క్లరికల్, మైనింగ్, స్టాఫ్ ముఖ్యనాయకుల సమావేశం సీసీసీలోని నర్సయ్య భవన్‌లో ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ, నూతన బొగ్గు గనులను ప్రారంభించడం ద్వారా సింగరేణి మనుగడ కొనసాగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థకు చెల్లించాల్సిన 33వేలకోట్ల రూపాయలు వెంటనే ఇవ్వాలన్నారు. నేడు కార్మికవర్గం అనుభవిస్తున్న ప్రతీ హక్కును తమ యూనియన్ ఆధ్వర్యంలో దశాబ్ధాలుగా పోరాడి సాధించినవేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, కేంద్ర కార్యదర్శి అక్బర్ అలీ, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, సీపీఐ మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, నాయకులు అఫ్రోజ్‌ఖాన్, రాచర్ల చంద్రమోహన్, నాగభూషణం, ప్రసాద్ రెడ్డి, సుధాకర్, మైనింగ్ స్టాఫ్ నాయకులు పాల్గొన్నారు.

రిటైర్డు కార్మిక సంఘం అధ్యక్షుడిగా శంకర్

మందమర్రిటౌన్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మందమర్రి సింగరేణి రిటైర్డు కార్మికసంఘం అధ్యక్షుడిగా వాసాల శంకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏరియాలోని రిటైర్డు కార్మికులందరూ ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శంకర్ మాట్లాడుతూ రిటైర్డు కార్మికుల సంక్షేమం, వారి హక్కుల కోసం పోరాడుతానని తెలిపారు.

దళితుల హక్కుల రక్షణకు కృషి

శ్రీరాంపూర్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఉన్న దళితుల హక్కుల రక్షణకు దళిత హక్కుల రక్షణ ఉద్యమం(ఏఐడీఆర్ఎం) కృషి చేస్తుందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి సీతారామయ్య, కె రాజ్‌కుమార్ అన్నారు. ఏఐడీఆర్ఎం 2వ మహాసభల పోస్టర్లను నస్పూర్‌లోని నర్సయ్యభవన్‌లో ఆవిష్కరించి మాట్లాడారు. వచ్చే నెల 5నుంచి 7వరకు హైదరాబాద్‌లో సభలు జరుగుతాయన్నారు. ఈ సభల్లో దళితులకు ఆర్థిక, రాజకీయ, హక్కుల పరిరక్షణ, కులవివక్ష నిర్మూలన, ఎస్‌సీ సబ్‌ప్లాన్ అమలు, నిధుల మళ్లింపు నిలిపివేత, తదితర సమస్యల గురించి చర్చించి పరిష్కారం దిశగా భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. ఈ సభలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అక్బర్‌అలీ, డీహెచ్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మారపల్లి రవి, సీపీఐ మండల కార్యదర్శి జగుల మల్లయ్య, ఎస్‌సీడబ్ల్యూయూ ఉప ప్రధానకార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, నాయకులు నర్సింగారావు, అఫ్రోజ్‌ఖాన్, సరోజ, శైలజ, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమంలో సాటి... లాభాల్లో మేటి

(5వ పేజీ తరువాయి)



వర్క్‌షాప్‌లో విజయ సంకేతం చూపుతున్న మహిళా ఉద్యోగులు

ఆర్కే 5 గని ఆల్ ఇండియా మైన్ స్సేఫ్టీ అవార్డును గెలుచుకుంది. సింగరేణి ఆవిర్భావ వేడుకల్లో ఆర్కే 6గని ఉత్తమ ఎస్‌డీఎల్ నిర్వహణ గనిగా అవార్డు అందుకుంది. ఈ ఏడాదిలో 18 తీవ్ర ప్రమాదాలు, 10 రిపోర్టబుల్ ప్రమాదాలు, ఒక నేచురల్ డెత్(ఐకే1ఏ) చోటుచేసుకుంది.

మహిళా ఉద్యోగులకు సమాన అవకాశాలు

ఏరియాలో 176 మంది మహిళలు వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు. వారి సంక్షేమానికి రెస్ట్‌హాళ్లు ఇతర సదుపాయాలు కల్పిస్తున్నారు. మహిళా ఉద్యోగులకు కేటగిరీ కల్పించేందుకు ఇటీవల కౌన్సెలింగ్ ఏర్పాటు చేశారు. ఇందులో సర్వే మజ్దూర్, కన్వేయర్ ఆపరేటర్, పంప్ ఆప రేటర్, వాల్వ్ ఆపరేటర్, కుక్, వెండార్, తదితర 16పోస్టుల కోసం ఆప్షన్లు కోరగా 110మంది ఎంచుకున్నారు. వారు ఎంచుకున్న ప్రకారం శిక్ష ణ ఇచ్చి ఉద్యోగ బాధ్యతలు అప్పగించనున్నారు.

ఇప్పటికే 12మంది మహిళా ఉద్యోగులు ఎస్‌అండ్ పీసీ విభాగంలో రక్షణవిధులు నిర్వర్తిస్తు న్నారు. కార్పొరేట్ కార్యాలయం నుంచి అందిన ఉత్తర్వుల మేరకు మహిళా ఉద్యో గులతో పూర్తిస్థాయిలో ఒక షిఫ్ట్ నడపాల ని నిర్ణయించారు. ఇందుకు తగిన ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇటీవల నియమితులైన గ్రాడ్యుయేట్ ట్రైనీ (మైనింగ్)లలో ముగ్గురు మహిళా అధికారులు న్నారు. వారు ఏడాదిపాటు శిక్షణ పొందిన అనం తరం అండర్ మేనేజర్లుగా కొనసాగుతారు.

పర్యావరణంలో...

పర్యావరణ పరిరక్షణకు అధికారులు పలు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా శ్రీరాంపూర్ ఓసీపీలో ఏకో పార్క్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఇప్పటికే నస్పూర్, శ్రీరాంపూర్‌లో సాధారణ పార్కులు ఉన్నాయి. సింగరేణి నిర్వాసిత గ్రామాలైన రామారావుపేట, ఇందారం, ఆర్‌ఆర్‌కాలనీలకు 100 చొప్పున సోలార్ ల్యాంపులు అందించారు. జీఎం కార్యాలయం ఎదుట ఇటీవల ఏర్పాటు చేసిన బటర్‌ఫ్లై పార్క్ ఆకట్టుకుంటోంది. విరివిగా గనులపై మొక్కలు నాటుతూ పర్యావరణాన్ని కాపాడుతున్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు కొత్త హక్కు

సంస్థకు వచ్చిన లాభాల నుంచి 33శాతం వాటాగా ఉద్యోగులకు 796 కోట్ల రూపాయలు పంపిణీ చేసింది. కంపెనీ చరిత్రలో మొట్ట మొదటిసారిగా కాంట్రాక్ట్ కార్మికులకు సైతం 5 వేల రూపాయల చొప్పున అందించింది. గతానికి భిన్నంగా దసరా సందర్భంగా గనులపై విందు ఏర్పాటు చేశారు. కార్మికులకు కంపెనీ స్థితిగతులను వివరించేందుకు ఈ ప్రయత్నం చేశారు.

కోటి రూపాయల ప్రమాద బీమా

సింగరేణి ఉద్యోగులు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులలో వేతన ఖాతా కలిగి ఉంటే వారికి కోటి రూపాయలు ప్రమాద బీమా అందించేందుకు సింగరేణి యాజమాన్యం ఆయా బ్యాంకులతో ఒప్పందం చేసుకుంది. సింగరేణిలో పనిచేస్తున్న 32వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులకు సైతం 30లక్షల రూపాయల ప్రమాద బీమాను వర్తింపజేసేలా అగ్రిమెంట్ జరిగింది.

పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్

సింగరేణి ఉద్యోగుల పిల్లలకు ఉత్తమ విద్య అందించాలనే లక్ష్యంతో సింగరేణి సంస్థ సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా రామగుండం-2 ఏరియాలోని సింగరేణి పాఠశాలలో సీబీఎస్‌ఈ బోధనను ప్రయోగాత్మకంగా చేపట్టనున్నారు. అనంతరం అన్ని పాఠశాలల్లోనూ ఇదే విధానం అమలు చేయాలని భావిస్తున్నారు.

వయో పరిమితి పెంపు

కారుణ్య నియామకాల్లో వారసుల గరిష్ఠ వయో పరిమితిని 35ఏళ్ల నుంచి 40ఏళ్లకు పెంచేందుకు సింగరేణి బోర్డు అనుమతించింది. దీనివల్ల 200మంది వారసులకు లబ్ధి చేకూరింది. భవిష్యత్ నియామకాల్లోనూ వారసులకు మేలు జరుగనుంది.

ఉత్పత్తిలో వెనుకబాటు

బెల్లంపల్లి రీజియన్‌లో ఉన్న శ్రీరాంపూర్, మందమర్రి, శ్రీరాంపూర్ ఏరియాలు ఉత్పత్తిలో వెనుకబడి ఉన్నాయి. ఈ నెల 24వ తేదీ వరకు శ్రీరాంపూర్ 54.5శాతం, మందమర్రి ఏరియా 55.6, బెల్లంపల్లి ఏరియా 58.6శాతంతో నడుస్తున్నాయి. శ్రీరాంపూర్ ఏరియాలో రోజువారీగా, నెలవారీగా లక్ష్యాలను నిర్దేశించుకొని బొగ్గును వెలికితీస్తున్నారు. 2023-24లో 38 లక్షల 81 వేల 83 మెట్రిక్ టన్నులు ఉత్పత్తి చేశారు. ఈ ఏడాది 2024-25లో 63 లక్షల పది వేల మెట్రిక్ టన్నుల ఉత్పత్తిని శ్రీరాంపూర్ ఏరియాకు లక్ష్యంగా నిర్ణయించారు. రోజు సుమారుగా 2.81 లక్షల టన్నుల బొగ్గు వెలికి తీయాల్సి ఉంది. అయితే లక్ష్య సాధనకు అధికారులు కృషి చేస్తున్నారు.

ఆటల్లోనూ మెరికలు

సింగరేణి కార్మికులు ఆటపాటల్లో తమ సత్తా చాటుతున్నారు. ఈ ఏడాదిలో జరిగిన కంపెనీ స్థాయి పోటీల్లో శ్రీరాంపూర్ చెందిన పలువురు వివిధ పోటీల్లో విజయం సాధించారు. ఫుట్‌బాల్, వాలీబాల్, క్రికెట్, క్యారమ్స్(సింగిల్స్, డబుల్స్)లో క్రీడాంశాలలో విజయం సాధించారు. హాకీలో రన్నర్‌గా నిలిచారు. అథ్లెటిక్స్‌లో ఆరుగురు క్రీడాకారులు ప్రథమ స్థానంలో నిలిచారు. సాంస్కృతిక పోటీల్లో నలుగురు మొదటి, నలు గురు ద్వితీయ స్థానంలో ఉన్నారు. టేబుల్ టెన్ని స్‌లో కె. ఈశ్వరాచారి, ఎం. వెంకటేశ్వర్ రావు కోలిండియాలో విజయం పొందారు.

ఆదరణకు నోచుకోని దశావతార విగ్రహాలు



రాజారాం గ్రామంలో వెలిసిన దశావతార విగ్రహాలు



ధ్వంసమైన కూర్మావతారం విగ్రహం

వేమనపల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వేమనపల్లి మండలంలోని రాజారాం గ్రామంలో పురాతన దశావతార విగ్రహాలు ఆదరణకు నోచుకోవడం లేదు. రాజారాం గ్రామంలో 12, 13వ శతాబ్దంలో ఈ ప్రాంతాన్ని పరిపాలించిన యాదవమహారాజు కుమారుడైన అమ్మని రాజు ఈ విగ్ర హాలను చెక్కించినట్లు శాసనాలు చెబుతున్నాయి. వినాయక విగ్రహాన్ని వేమనపల్లి శివాలయంలో ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తుండగా మిగి తా విగ్రహాలైన నర్సింహాస్వామి, కూర్మావతారం, బుద్ధుడు, ఆంజనేయ, రేణుక మాత విగ్రహా లు చాలావరకు ధ్వంసమయ్యాయి. ఇక్కడ యేటా జూలైలో గిరిజనులు రేణుకమాతకు పూజలు చేసి జాతర నిర్వహి స్తారు. ఈ జాతరకు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున హాజరవుతారు. దశావతార విగ్రహాలను ఎవరు పట్టిం చుకోకపోవడంతో ఆదరణకు నోచుకోవడం లేదు. 12 సంవత్స రాలకు ఒకసారి ప్రాణహిత నది పుష్కరాలకు వచ్చే భక్తులు ఈ విగ్రహాలను దర్శించుకుంటారు. అధికా రులు, ప్రజా ప్రతినిధులు ఈ విగ్రహాల ప్రాముఖ్యతను ప్రజలకు తెలియ జేయాలని, ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సమాజ సేవలో 'జనహిత'

● 150 మంది సభ్యులతో ముందుకు ● దాతల సహకారంతో కార్యక్రమాలు



రక్తదానం చేస్తున్న జనహిత సేవా సంస్థ సభ్యులు (ఫైల్)

బెల్లంపల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆకలితో అలమటిస్తున్న వారికి అన్నదానం, సరుకులు, దుప్పట్లు, వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు పలువురు యువకులు. సమాజానికి సేవ చేయాలనే భావనతో బెల్లంపల్లి పట్టణానికి చెందిన యువకులు జనహిత సేవా సంస్థ స్థాపించి ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తం అందిస్తున్నారు.

బెల్లంపల్లి పట్టణానికి చెందిన పలువురు యువకులు కొన్నేళ్ళుగా జనహిత సేవా స్వచ్ఛంద సంస్థ పేరుతో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. 2017లో 20మంది సభ్యులతో సేవా సంస్థ స్థాపించారు. మొదట చిన్నచిన్న సేవా కార్యక్రమాలు చేపడుతూ ముందుకెళ్లారు. ప్రస్తుతం 150 మంది సభ్యులు సేవా సంస్థలో ఉండడంతో అందరు కలిసి బెల్లంపల్లిలోనే కాకుండా మారుమూల గ్రామాల్లో కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. కొవిడ్ సమయంలో వీరు కార్యక్రమాలను అందిస్తూ ప్రజలు, పోలీసులతో శభాష్ అనిపించుకున్నారు. సేవాసంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలతో ఎంతోమంది మన్ననలను పొందడమే కాకుండా అవార్డులు, ప్రశంసలు సైతం అందుకున్నారు.

నిర్వహించే సేవా కార్యక్రమాలు....

ప్రతీ బుధవారం అన్నదానం నిర్వహిస్తారు. ఇందుకు దాతల సహకారంతో ఇప్పటివరకు రూ.20 లక్షలకు పైగా ఖర్చు చేశారు. వేసవిలో చలివేంద్రాలు, రక్తదాన శిబిరాలు, నేత్రదానం, బెల్లంపల్లిలో నిత్య జనగనమన జాతీయ గీతాలాపన, కొవిడ్ సమయంలో సరుకులతో పాటు ఐసోలేషన్ సమయంలో భోజనం అందజేశారు. వైద్యఖర్చుల కోసం ఆర్థిక సహాయం, యోగా శిక్షణ, పాలిటెక్నిక్ ఉచిత శిక్షణ, దుప్పట్లు పంపిణీ, నిరుపేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ఆర్థిక సహాయం, పేదవారైన నిరాశ్రయులకు ఇండ్లు కట్టించడం, తదితర సేవా కార్యక్రమాలను చేస్తూ ముందుకెళ్తున్నారు. వీరు చేసే సేవా కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులు, వ్యాపారులే కాకుండా దాతలు సైతం అండగా నిలుస్తున్నారు.



వైద్య ఖర్చులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న సభ్యులు (ఫైల్)

సేవ సంతృప్తినిస్తుంది...

సేవా కార్యక్రమాలను నిర్వహించడం సంతోషాన్నిస్తుంది. ఏడు సంవత్సరాలుగా వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతూ ముందుకు వెళ్తున్నాం. అన్నదానం నిర్వహణకు ప్రజాప్రతినిధులు, సింగరేణి అధికారులు స్థలం కేటాయిస్తే బాగుంటుంది. సేవా కార్యక్రమాలకు దాతలు అండగా నిలుస్తున్నారు. నిరుపేద అభాగ్యులకు కడుపు నిండా భోజనం అందిస్తున్న అనుభూతి అనిర్వచనీయం.

-ఆడెపు సతీష్,
జనహిత సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు

కలిసికట్టుగా సేవా కార్యక్రమాలు

సభ్యులంరం కలిసి సేవా కార్యక్రమాలను చేపడుతూ ముందుకు వెళ్తున్నాం. ఆకలితీర్చే కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం నా అదృష్టం. నిరుపేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్థిక సహాయం, నిరాశ్రయులకు ఇండ్లు కట్టించడం మర్చిపోలేని సేవా జ్ఞాపకాలుగా నిలిచిపోతాయి. రక్తదానం, విద్య, వైద్యం కోసం ఏమైనా అవసరాలు ఉంటే సంప్రదించాలి.

-కాంపెల్లి విజయ్‌కుమార్,
కార్యనిర్వాహణ అధ్యక్షుడు

పేదలకు అండగా మా ఊరు స్వచ్ఛంద సంస్థ



సరుకులు పంపిణీ చేస్తున్న ఎండీ ఇబ్రహీం (ఫైల్)

మందమర్రి టౌన్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మా ఊరు స్వచ్ఛంద సంస్థ పేదలకు అండగా నిలుస్తోంది. ఉద్యోగ విరమణ అనంతరం సమాజసేవ చేయాలనే యోచనతో స్వచ్ఛంద సంస్థను నెలకొల్పి పెన్షన్ డబ్బులతో పేదలకు భరోసాగా నిలుస్తున్నాడు ఊరు మందమర్రికి చెందిన ఎండి ఇబ్రహీం.

ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నంత కాలం విద్యా వ్యాప్తికి కృషి చేశారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య భావ జాలం ఉన్న డీటీఎఫ్ (డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్) యూనియన్‌లో పనిచేసి సమస్యల సాధన కోసం అలుపెరుగని పోరాటాలు చేశాడు. రిటైర్డ్ అయిన అనంతరం స్వచ్ఛంద సంస్థతో సమాజ చైతన్యానికి, సామాజిక బాధ్యతకు స్ఫూర్తిగా నిలుస్తున్నాడు. ప్రతీ నెల తనకు వచ్చే పెన్షన్ డబ్బుల నుంచి పది శాతం కేటాయించి నెలకు 25 మంది పేదలకు సరుకులను పంపిణీ చేస్తున్నాడు. ఒక రోజు అన్నదానం కూడా చేపడుతున్నాడు. రెండు సంవత్సరాలుగా ఆయన సేవ చేస్తున్నాడు. ఎవరైన అనారోగ్యం బారిన పడితే అందుబాటులో ఉన్న వైద్యులతో పాటు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం అందిస్తున్నారు. స్వచ్ఛంద సంస్థకు గ్రామానికి చెందిన పెద్ది రాజన్నతో పాటు ఇతరులను సభ్యులుగా చేర్చుకొన్నారు. కులాంతర వివాహం చేసుకున్న ఇబ్రహీం మాస్టర్‌కు ఆయన సతీమణి కుటుంబ సభ్యులు కూడా సేవలో చేయూతనిస్తున్నారు. ఏది ఏమైనా ఆరున్నర దశాబ్దాల వయసులో అలుపెరుగకుండా ఆయన చేస్తున్న సేవలకు ప్రతీ ఒక్కరు సెల్యూట్ చేస్తున్నారు.

పేదలకు అండగా ఉండడమే నిజమైన సేవ...

ఆకలితో అలమటిస్తున్న పేదలకు అండగా నిలవడమే నిజమైన సేవ. ఇంటిని కుటుంబాన్ని పోషిం చే పెద్ద దిక్కు లేక చాలా కుటుంబాలు ఆకలితో పస్తులుంటున్నారు. అలాంటి వారికి బియ్యం, కారం లాంటివి అందజేసినా కడుపునిండా భోజనం చేస్తారు. తాను పుట్టి పెరిగిన మందమర్రిలో పేదల ఆకలిని తీర్చడానికి స్వచ్ఛంద సంస్థను నెలకొల్పాను. తాను మరణించే వరకు సేవ చేయాలని నిర్ణయించుకున్నాను. - ఎండీ ఇబ్రహీం

సింగరేణి ప్రాంత సమస్యలు పరిష్కరిస్తా



నరేందర్ రెడ్డికి స్వాగతం పలుకుతున్న మహిళలు

శ్రీరాంపూర్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): సింగరేణి ప్రాంత సమస్యలకు పరిష్కారం చూపుతానని ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి అన్నారు. మంచిర్యాలలో జరిగే ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయనకు ఇందారం క్రాసింగ్ వద్ద స్వాగతం పలికారు. ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెత్తుల రాజేంద్రపాణి ఆధ్వర్యంలో మహిళలు కోలాటాలతో స్వాగతం పలికారు. శ్రీరాంపూర్ బస్టాండ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం నుంచి అన్ని రకాల సహాయసహకారాలు అందించేందుకు కృషి చేస్తానని అన్నారు. ట్రస్మా నాయకులు ఉపేందర్, రామకృష్ణ, సత్యనారాయణ, పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రక్తదానంతో ప్రాణాలను కాపాడవచ్చని ఆర్థోపెడిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బుద్దె ప్రవీణ్ పేర్కొన్నారు. ఆదివారం తలసేమియా సికిల్ సెల్ వ్యాధిగ్రస్తుల కోసం జిల్లా కేంద్రంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రక్తదానంతో ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడవచ్చని, ఆరోగ్యవంతులైన ప్రతీ ఒక్కరు రక్తాన్ని దానం చేయాలని పేర్కొన్నారు. వైద్యులు, యువకులు, యువజన నాయకులు 40 మంది రక్తదానం చేయగా ప్రశంసా పత్రాలను అందజేశారు. వైద్యురాలు సింధూజ, పాల్గొన్నారు.

వైద్య సేవలందించడం అభినందనీయం

నెన్నెల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉచితంగా వైద్య సేవలందించడం అభినందనీయమని బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ అన్నారు. మంచిర్యాలకు చెందిన శ్రీగణేష్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ వారు మైలారంలో ఆదివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరంలో సీఐ మాట్లాడారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. శిబిరంలో వైద్య నిపుణులు డాక్టర్ గణేష్‌రాథోడ్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఎస్సై ప్రసాద్, హరీష్, మల్లాగౌడ్, రమేష్, సాయి, రమేష్, కాసం పురుషోత్తం పాల్గొన్నారు.

SANTOOR
సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీ
ఆంధ్రజ్యోతి ABN
అందమైన ముగ్గులు వేయండి.. ఆనందంగా బహుమతులు అందుకోండి. రాష్ట్ర స్థాయిలో విజేతలకు రూ.1,50,000/-లకు పైగా బహుమతులు.
మొదటి బహుమతి రూ.6,000/-
రెండో బహుమతి రూ.4,000/-
మూడో బహుమతి రూ.3,000/-
మంచిర్యాల : స్పాన్సర్స్ : ప్రథమ, ద్వితీయ బహుమతులు : డాక్టర్ నీలకంఠేశ్వర్‌రావు, డాక్టర్ రఘువంశీ
తృతీయ బహుమతి: సాన సుధతి, స్కూల్ ప్రిన్సిపాల్, కన్సోలేషన్ బహుమతులు: పత్తి వెంకటేష్
స్థలం: అభ్యాస స్కూల్, పాత మంచిర్యాల, బ్రిడ్జి సమీపంలో, ఆదిత్య ఎన్‌క్లేవ్, మంచిర్యాల
తేది : 05-01-2025, సమయం : ఉదయం : 9 గం॥ల నుండి, సంప్రదించవలసిన సెల్ నెం. 9866561478, 9985411280
కాగజ్‌నగర్ : స్పాన్సర్స్ : కాగజ్‌నగర్ పేపర్ మిల్లు, కాగజ్‌నగర్
అరుణ సర్వీస్ సర్వీసెస్ ఫ్రాంచాయిస్, ఈ డిజిటల్ సువిధా సెంటర్ స్టోర్, సర్‌సిల్క్ కాలనీ
స్థలం: ఎస్పీఎం క్లబ్, కాగజ్‌నగర్
తేది : 05-01-2025, సమయం : ఉదయం : 9 గం॥ల నుండి 12గం॥ల వరకు సంప్రదించవలసిన సెల్ నెం. 9985411285, 8555045929
నిబంధనలు: మహిళలు మాత్రమే పాల్గొనాలి. చుక్కల ముగ్గులు మాత్రమే వేయాలి. ఎన్ని చుక్కలు, ఎన్ని వరుసలు చెప్పగలిగి ఉండాలి.
ముగ్గు, రంగులు వగైరా పోటీదారులే తెచ్చుకోవాలి. ముగ్గు వేయడానికి గరిష్ఠ సమయం 2 గంటలు
యవ్వనపు చర్మ రహస్యం



Fashion Partner
DIGSEL WOMEN'S
సెల్సియా
ట్రెండీ మహిళల అంతర్గత దుస్తులు
selsia TRENDY WOMEN'S
BRA - PANTIES - SLIPS & LEGGINGS
SCAN & BUY
TRADE ENQUIRY : 93445 53675

Gardening Partner
ఎటువంటి పంటలకైనా క్రాఫ్ట్ వారి పెర్‌ఫెక్ట్
ఆకు కూరలు, కూరగాయలు, పళ్ల పంటలు, మిరప, పొగాకు, పసుపు వంటి వాణిజ్యపంటలు, వరి, రాగి మొదలైన పంటలు, మిద్దెతోటలు, పెరటి తోటలకైనా చీడపీడలబారిన పడకుండా, లేదా చీడపీడలతో ఆకు ముడలతో పంట పాడైనా రామబాణం లాంటిది 'పెర్‌ఫెక్ట్'. ఒక్క లీటరు నీటికి కేవలం 2ఎంఎల్ పెర్‌ఫెక్ట్‌ను కలిపి పిచికారి చేయడం ద్వారా చీడపీడలు, ఆకుముడత, మిరపలో నల్లతామర వంటి రోగాలను నివారించి, ప్రారంభోలి మొక్కలు నూతన జవసత్వాలతో ఏపుగా పెరిగి, (7-15 రోజులకొకసారి పిచికారి చేయవలసి ఉంటుంది) కొత్తపూత పిందెలతో అధిక దిగుబడినిస్తుంది.
వృక్ష ఆయుర్వేదం (100%) ఆర్గానిక్ | సేంద్రియ వ్యవసాయం | రసాయనిక అవశేషాలు లేని పంటల ఉత్పత్తి | 11 వనమూలికల ఔషధ సమ్మేళనం | సమగ్ర సస్య సంరక్షణ
B.Sc. (Agri), B.Sc.(Horti), Agri Business Management, Any Degree చేసినవారికి ఏరియా/ జిల్లాల వారీగా ఉద్యోగావకాశాలు కలవు.
ఆకర్షణీయమైన ఆదాయం. ఆసక్తిగలవారు మెయిల్‌ద్వారాగానీ, ఫోన్‌ద్వారా గానీ సంప్రదించండి.
ఈమెయిల్ ID: globalgreenperfekt@gmail.com, వెబ్‌సైట్: www.perfektindia.in, కస్టమర్ కేర్ నంబర్లు: 94482 74211, 73377 74148



ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కుమరం భీం

జిల్లా వార్తలు

8

సోమవారం 30 డిసెంబరు 2024



కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే

- అర్హులను ఎంపిక చేసేందుకు ఇంటింటికి
- డబుల్ బెడ్‌రూం ఇండ్లు తదితరాలపై అధికారుల దృష్టి
- అన్ని వివరాలు యాప్‌లో నమోదు
- రేపటితో ముగియనున్న సర్వే ప్రక్రియ గడువు



కాగజ్‌నగర్‌లో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా(ఫైల్)

కాగజ్‌నగర్ టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల సర్వే కొనసాగుతోంది. సర్వేచివరి తేదీ ఈనెల31న ఉన్నప్పటికీ మరింత పొడిగించే అవకాశాలున్నాయని భావిస్తున్నారు. కొద్దిరోజులుగా సర్వేలో సాంకేతిక సమస్యలు వస్తుండడంతో పూర్తిస్థాయిలో చేయాలంటే మరింత గడువు కావాల్సి ఉంది. ఇందుకోసం అధికారులు, సిబ్బంది మండలస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు శ్రమిస్తున్నారు. గత జనవరి నెలలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక ఇచ్చిన హామీ ప్రకారం ఇందిరమ్మ ఇండ్లు తదితర విషయాలపై ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరించి కసరత్తు మొదలుపెట్టారు. ఈ క్రమంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ప్రభుత్వం చేపట్టిన సర్వే ప్రక్రియ కొనసాగుతోంది. అలాగే ఆయాచోట్ల నిర్మాణంలో ఉన్న, పూర్తి అయిన డబుల్ బెడ్ రూం ఇండ్లపై అధికారులు దృష్టి పెట్టి ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలమేరకు సర్వే చేపడుతున్నారు. కొన్ని చోట్ల మధ్యలో ఆగిపోయిన డబుల్ బెడ్‌రూం ఇండ్లపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టిపెట్టారు.

నియోజకవర్గానికి 3500 ఇండ్లు..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ నియోజకవర్గానికి ఇందిరమ్మ పథకం కింద 3500ఇండ్లను మంజూరు చేస్తూ ప్రకటించింది. ఇందుకోసం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపడుతున్నారు. సర్వేలో భాగంగా సిబ్బంది ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తులు చేసుకున్న కుటుంబ వివరాలు, ఫొటోతోపాటు పూర్తిస్థాయిలో వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నారు.

కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో 30వార్డులకు గానూ ఆయా పథకాలకు 15230 దరఖాస్తులు రాగా, వీటిలో 10890 దరఖాస్తులు కేవలం ఇందిరమ్మ ఇండ్ల కోసం వచ్చాయని అధికారులు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి వివరాలు నమోదు చేస్తున్నారు.

ఈ సర్వే అనంతరం ఎస్‌హెచ్‌జీ, మున్సిపల్, మున్సిపల్ వార్డు ప్రతినిధితో వార్డు సభలు ఏర్పాటు చేసి లబ్ధిదారులను పక్కాగా ఎంపిక చేయనున్నారు. త్వరలోనే ప్రభుత్వం ఇచ్చే విధివిధాలను అనుసరించి ఇండ్ల మంజూరు చేయనున్నారు. ఇళ్లులేని వారికి సొంత జాగా ఉంటే వారి వివరాలను పొందుపరుస్తున్నారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం విషయంలో ఎటువంటి అవకతవకలు చోటు చేసుకోకుండా ఉండేందుకు ఆదేశాలు ఇవ్వడంతో ప్రణాళిక బద్ధంగా అమలు పరుస్తున్నారు. అద్దె ఇంట్లో ఉండడం, కుటుంబ వివరాలు, తదితర అన్ని సమగ్రంగా నమోదు చేసుకుంటున్నారు. ఇల్లు కట్టుకునేందుకు రూ.5 లక్షలు విడతల వారీగా అందించనున్నారు. సర్వేపూర్తి కాగానే లబ్ధిదారులను ప్రకటించనున్నారు. ఇందుకోసం గతంలో ఉన్న హౌజింగ్ సిబ్బందితోపాటు అదనంగా సిబ్బందిని తీసుకొనే విషయంపై ఉన్నతాధికారులు యోచిస్తున్నారు. కాగజ్‌నగర్‌లో అసంపూర్తిగా మిగిలిపోయిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలను కూడా ఇటీవల తిరిగి ప్రారంభించారు. నిర్మాణాలు పూర్తి అయినప్పటికీ పనులు పూర్తికాని పైపులైన్ కనెక్షన్, మరుగుదొడ్లు తదితర పనులు చేపడుతున్నారు. నూతన సంవత్సరంలో ఇందిరమ్మ ఇండ్ల కేటాయించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది.

నిరుద్యోగులు ఉపాధి అవకాశాలపై దృష్టిసారించాలి

జైనూర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పోటీ ప్రపంచంలో నిరుద్యోగులు ఉపాధి అవకాశాలపై దృష్టిసారించాలని జైనూర్ సీఐ రమేష్ కోరారు. మండల కేంద్రంలో పవర్ భీమానాయక్ బంజారా వస్త్రదుకాణాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత చదువుపై దృష్టిసారించాలని ప్రభుత్వఉద్యోగాలపై ఆశపడకుండా ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు పొందాలన్నారు. ఉద్యోగాలు రాకపోతే కుట్టు మిషన్లు, కిరాణ, జనరల్‌స్టోర్స్ దుకాణాల వ్యాపారం చేసుకుంటు కుటుంబ పోషణ చేసుకోవాలని సూచించారు. కార్యమంలో నాయకులు పవార్ పీతనాయక్, మాజీ సర్పం చులు, వ్యాపారులు పాల్గొన్నారు.

గోండ్ మహాసభ సన్నాహక సమావేశం

సిర్పూర్(యు), డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి):అఖిల భారతీయ గోండ్వానా గోండ్ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు ఆర్క మానిక్‌రావు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ జనవరి 17,18,19 తేదీల్లో మహారాష్ట్రలోని అమరావతి జిల్లా బడ్నేర్‌లో మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు.ఈ సభలలో దేశంలోని 20రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొంటారన్నారు.ఈ సందర్భంగా సంస్కృతీ,సంప్రదాయాలు,విద్య,వైద్య,ఉపాధి,వ్యవసాయం,ప్రభుత్వ సంక్షేమ పథకాలు,గిరిజన చట్టలు తదితరాలపై చర్చించి తీర్మాణాలు చేస్తారన్నారు. కార్యక్రమంలో గోండి ధర్మ కోయపూన్సెం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్రం ఆనంద్ రావు, రాష్ట్ర నాయకులు సలాం మానిక్‌రావు, మాజీ సర్పంచులు మెస్రం భూపతి, ఆత్రం జాలంషా, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చెందాలంటే చదువు ఒక్కటే మార్గం: ఎస్పీ

- మంగిలో పోలీసుల ఆధ్వర్యంలో మెగా హెల్త్‌క్యాంపు



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

తిర్యాణి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): భవిష్యత్ తరాలు మారాలన్న అభివృద్ధి చెందాలన్నా చదువు ఒక్కటే మార్గమని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం మండలంలోని మంగి గ్రామంలో పోలీసులు మీ కోసం కార్యక్రమంలో భాగంగా మెగా హెల్త్‌క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్పీ మాట్లాడుతూ చదువుతోనే జీవితాల్లో వెలుగులు వస్తాయన్నారు. జిల్లాలోని మారుమూల మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన మంగిలో తిర్యాణి పోలీసుల ఆధ్వర్యంలో ఉచిత మెగావైద్యంశిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆదివాసీలు అభివృద్ధి మార్గం వైపు పయనించేలా పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు గ్రామంలో కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. చదువు, క్రీడల్లో ప్రతిభ కలిగిన యువకులను ప్రోత్సహించడానికి పోలీసు శాఖ, ప్రభుత్వం తోడుగా ఉంటుందన్నారు. అనంతరం డాక్టర్లు గ్రామస్తులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. క్యాంపులో వైద్యంతోపాటు 500దుప్పట్లు, 10 వాలీబాల్ కిట్లు, విద్యార్థులకు పెన్నులు, మందులు పంపిణీ చేశారు. క్యాంపునకు వచ్చిన వారికి భోజనవసతి కల్పించారు. మెగా హెల్త్‌క్యాంపు విజయవంతం కావడానికి సహకరించిన వైద్యులకు ఎస్పీ ప్రత్యేకధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ ప్రభాకర్‌రావు, డీఎస్పీ కరుణాకర్, సీఐ బుద్దే స్వామి, ఎస్సై మాధవ్, డాక్టర్‌లు కుమారస్వామి, రఘువంశీ, శ్రీధర్‌బాబు, రోజ, కావ్య తదితరులు పాల్గొన్నారు.

పులి కదలికలపై ప్రజలకు అవగాహన

కెరమెరి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వారసంతలో పులి కదలికలపై గోండి, కొలాంగూడ, లంబాడ బాషలో అటవీశాఖాధికారులు మైక్‌ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. వాగులు, ఒర్రెలు, అటవీప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పత్తికూలీలు గుంపులుగా చప్పుడు చేస్తూ పత్తి ఏరాలన్నారు. కార్యక్రమంలో పీఆర్వో మజారొద్దీన్, ఎఫ్‌బీవో రామయ్య, సిబ్బంది ఉన్నారు.

రైతులపై ప్రభుత్వం తీరు మారాలి

- బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

పెంచికలపేట, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంత గ్రామాల రైతులపట్ల ప్రభుత్వం తీరు మార్చుకోవా లని, పులలపేరుతో గ్రామాలను తరలిస్తామంటే ఊర్కోమని బీఆర్‌ఎస్ రాష్ట ప్రధానకార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ సిర్పూర్ నియోజకవర్గంలో విద్యా, వైద్యం, రోడ్లు మూలనపడ్డాయని మండిపడ్డారు. ముఖ్యంగా అటవీప్రాంత గ్రామాల్లో ఒకవైపు పులి భయం మరొక వైపు వ్యవసాయం చేయకుండా అధికారుల భయం రైతులను వేధిస్తోందన్నారు. పులిదాడిలో గాయాలపాలైన, మరణించిన రైతులకు రాష్ట్రప్రభుత్వం, అధికారులు సరైన పరిహారం అందించడం లేదన్నారు.

15రోజులుగా ఆశ్రమ పాఠశాలల సీఆర్టీలు, ఎస్ఎస్ఏ ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయడంతో పాఠశాలల్లో చదువు సాగడం లేదన్నారు. ముఖ్యమంత్రి వెంటనే వారి సమస్యలను పరిష్కరిం చాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, మహేష్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

జాతీయస్థాయి బాల్‌బాడ్మింటన్ పోటీలకు ఎంపిక



ఆత్రం స్వప్న



శ్రావణి

రెబ్బెన, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి బాల్‌బాడ్మింటన్ పోటీలకు గోలేటి క్రీడాకారిణులు ఆత్రం స్వప్న, శ్రావణి ఎంపికైనట్టు ఆదిలాబాద్ జిల్లా బాల్‌బాడ్మింటన్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి ఆర్ నారాయణరెడ్డి తెలిపారు. ఆత్రం స్వప్న తెలంగాణ రాష్ట్ర మహిళాజట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నట్టు ఆయన తెలిపారు. మహారాష్ట్రలోని కోమోతే రైగాడే జిల్లాలో జాతీయస్థాయి పోటీలు జరుగుతున్నట్టు తెలిపారు. ఎంపికైన క్రీడాకారుణులను బాల్‌బాడ్మింటన్ సంయుక్తకార్యదర్శి ఎస్ తిరుపతి, సింగరేణి హైస్కూల్ పీఈటీ భాస్కర్, షార్ప్‌బాల్ బాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు వంగ మహేందర్, జనరల్ సెక్రెటరి మారిన వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సీఎంకప్ పోటీల్లో జిల్లాకు రజత పతకం



రజత పతకం సాధించిన సెపక్‌తక్రా జిల్లా జట్టు

రెబ్బెన, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): హన్మకొండ జిల్లా జవహర్‌లాల్ స్టేడియంలో జరిగిన సీఎం కప్ సెపక్‌తక్రా పోటీల్లో జిల్లా జట్టు రజత పతకం సాధించినట్టు తెలంగాణ రాష్ట్ర సెపక్‌తక్రా ప్రధానకార్యదర్శి ఆర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సీఎం కప్ సెపక్‌తక్రా క్రీడల్లో గోలేటికి చెందిన పురుషులు ఆర్ వెంకటేష్, ఎ రాజేందర్, పి రాజశేఖర్, తిరుమలేష్, రాజశేఖర్, శ్రీకాంత్ క్రీడాకారులు పాల్గొన్నట్టు తెలిపారు. జిల్లా జట్టును స్పోర్ట్స్ అధికారులు రమాదేవి, మీనారెడ్డి, సాగర్, ఇతర శాఖల అధికారులు, ఆయా సంఘాల ప్రతినిధులు అభినందించారు.

నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి: ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకలను కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ డిసెంబరు31న జిల్లావ్యాప్తంగా విస్తృత తనిఖీలు నిర్వహిస్తామన్నారు. నూతన సంవత్సర వేడుకలు సమీపిస్తున్న వేళ సామాన్య ప్రజలకు ఎలాంటి అసౌకార్యలు కలగకుండా పోలీసుశాఖ ముందస్తుచర్యలు చేపడుతుందని తెలిపారు. జిల్లా పరిధిలోని పోలీసులతోపాటు ట్రాఫిక్, టాస్క్‌ఫోర్స్, షీటీం, పెట్రోలింగ్ విభాగాలకుచెందిన పోలీసులు ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహిస్తారన్నారు. అర్ధరాత్రి1గంటలోపు వేడుకలు ముగించాలన్నారు. ఎవరైనా ఇబ్బందులు కలిగిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలను వినియోగిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమించినా, ఉల్లంఘించినా వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన డీఎస్పీ



పోలీసు స్టేషన్‌ను సందర్శిస్తున్న డీఎస్పీ రామానుజం

చింతలమానేపల్లి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్‌ను డీఎస్పీ బి రామానుజం ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, రిసెప్షన్, లాకప్, మెన్‌బ్యారక్, టెక్నికల్‌రూం, పరిసరాలను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి వారివిధులకు సంబంధించిన సూచనలు చేశారు. సమస్యలను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. కాలనీలో సీసీ కెమెరాలు అమర్చేవిధంగా ప్రజలను చైతన్యపర్చాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. కొత్తసంవత్సరం వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఊపిరితిత్తుల వ్యాధితో బాలిక మృతి



ఇప్ప శ్రీవాణి(ఫైల్)

బెజ్జూరు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని సలుగుపల్లి గ్రామానికి చెందిన ఇప్పశ్రీవాణి(11) అనే బాలిక ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. శ్రీవాణి రెండేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతోందన్నారు. ఇటీవల కరీంనగర్ పట్టణంలోని ఓప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం చేయించగా ఊపిరితిత్తులు చెడిపోయాయని డాక్టర్లు తెలిపారన్నారు. చికిత్స పొందుతూ కరీంనగర్‌లోనే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శ్రీవాణి ప్రస్తుతం స్థానిక పాఠశాలలో 5వ తరగతి చదువుతోంది.

కష్టాల్లో పత్తి రైతు

- గణనీయంగా తగ్గిన దిగుబడి
- ఎకరానికి 3నుంచి 4క్వింటాళ్లు మాత్రమే
- అది కూడా ప్రైవేటు వ్యాపారులకే విక్రయిస్తున్నరైతులు



ఏరకుండా చేనులోనే ఉన్న పత్తి

కెరమెరి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): పత్తి రైతులకు ఈ ఏడాది ఏ మాత్రం కలిసిరాలేదు. సీజన్ ప్రారంభంలో మురిపించిన వర్షాలు పంట కాత, పూతదశలో ముఖం చాటేశాయి. దీంతో పత్తిలో పూత, కాత రాలిపోయింది. ఆశించిన స్థాయిలో కాత లేకపోవడంతో దిగుబడి గణనీయంగా తగ్గింది. అంతా ఇంతా పంట చేతికి వచ్చే సమయంలో ములిగే నక్కపై తాటికాయ పడినట్లు వర్షాలకు జిల్లా వ్యాప్తంగా వేలాది ఎకరాల్లో పత్తి పంట తడిసి ముద్దయింది. తడిసిన పత్తిరంగు మారి నాణ్యత దెబ్బతింది. దీంతో రైతులు తక్కువ ధరకే పంటను అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

- **నాలుగేళ్లుగా ఇవే కష్టాలు..**

నాలుగు ఏళ్లుగా పత్తిసాగు చేసే రైతులు నష్టాలనే చవిచూస్తున్నారు. పూత కాత దశలో వర్షాలు ముఖం చాటేయడంతో ఒక్కో చెట్టుకు 20నుంచి 30వరకు కాయలు మాత్రమే కాశాయి. వర్షాలు సమృద్ధిగా కురిసిన సమయంలో ఒక్కోచెట్టుకు సుమారు70 నుంచి 100కాయలు కాస్తాయి. దీన్ని బట్టి పత్తి దిగుబడి ఏ మేరకు తగ్గిందో అర్థం చేసుకోవచ్చు. ప్రతిసారి రైతుకు ఎకరానికి సుమారు 8క్వింటాళ్ల దిగుబడిరాగా ఈ సీజన్‌లో మాత్రం3,4క్వింటాళ్ల దిగుబడి వచ్చినట్లు రైతులు పేర్కొంటున్నారు.

- **ఆదుకోని సీసీఐ కొనుగోలు కేంద్రాలు..**

జిల్లాలో ఈసారి వానాకాలం 3.5లక్షల ఎకరాల్లో పత్తిపంట సాగైంది. సుమారు 28లక్షల క్వింటాళ్లవరకు పత్తిపంట దిగుబడి వస్తుందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ఇందుకోసం మొత్తం 17సీసీఐ కొనుగోలుకేంద్రాలు ఏర్పాటుచేయగా ఇప్పటి వరకు 6,65,071క్వింటాళ్ల పత్తిని మాత్రమే కొనుగోలుచేశారు. సీసీఐ రైతులకు ఏ మాత్రం ఆదుకోలేకపోయింది. సీసీఐ అధికారులు పత్తిని కొనేందుకు ఆసక్తి కనబర్చకపో వడం వల్ల రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

- **ప్రైవేటు వ్యాపారుల దోపిడీ..**

రైతుల అమాయకత్వం ఆర్థిక అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రైవేటు వ్యాపారుల అడ్డగోలుగా దోచుకుంటున్నారు. ప్రభుత్వం సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పొడవురకం గింజపత్తికి క్వింటాలుకు రూ.7521చెల్లిస్తుండగా మధ్య రకం గింజపత్తికి రూ.7121 చెల్లిస్తున్నారు. సీసీఐకొనుగోలు కేంద్రాల్లో ఉన్న నిబంధనలప్రకారం.. పత్తి డబ్బులు చెల్లింపునకు కనీసం 15రోజుల గడువువిధిస్తున్నారు. గత్యం తరం లేక సీసీఐని కాదని రైతులు ప్రైవేటు వ్యాపారులకు పత్తి రూ.6500 నుంచి రూ.6800వరకే విక్రయిస్తున్నారు. పంట విక్రయించిన వెంటనే డబ్బులు కావాలంటే వందకు రూ.1.50క్యాష్ కటింగ్‌పేరుతో కోత విధించి మిగిలినమొత్తం చెల్లిస్తున్నారు. రైతులు తమఅవసరాల నిమిత్తం క్యాష్ కటింగ్‌కు అంగీకరించాల్సిన పరిస్థితి నెలకొంది.

పెట్టుబడి వస్తలేదు..

- శ్రీకాంత్, రైతు, గోయగాం



పత్తి రైతుకు పెట్టుబడి కూడా వస్తలేదు. పంట సాగు చేయాలంటేనే భయంగా ఉంది. ప్రభుత్వం ఆదుకోవాలి. లేని పక్షంలో రైతులు మరోసారి అప్పులు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

కరాటే పోటీల్లో విద్యార్థుల సత్తా



సాధించిన పతకాలతో విద్యార్థులు

సిర్పూర్(టి), డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఆర్యవైశ్యసంఘభవనంలో ఆదివారం జరిగిన నేషనల్ కరాటేపోటీల్లో మండలకేంద్రంలోని ఎస్ఆర్ ప్రైవేటుపాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. 17బంగారు పతకాలు, 7వెండి పతకాలు, 8కాంస్య పతకాలను సాధించారు. దీంతో విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

ముగిసిన మల్లన్న బోనాల జాతర



శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

కాగజ్‌నగర్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ ఈసుగాం శివమల్లన్న ఆలయంలో ఆదివారం బోనాల జాతర ముగిసింది. ఉమ్మడి జిల్లాల నుంచి ఇరవై రోజులుగా భక్తులు ఈసుగాం ఆలయానికి వచ్చి బోనాలు వండి స్వామి వారికి సమర్పించారు. ఈ సందర్భంగా వేదపండితుడు నరహరిశర్మ ఆధ్వర్యంలో ఆదివారం శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. చివరి వారం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనాన్ని జయప్రదం చేయండి

ఆసిఫాబాద్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఫిబ్రవరి9న నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. 2023-24 విద్యాసంవత్సరం వరకు చదువుకున్న పూర్వ విద్యాలందరూ పాల్గొనాలని కోరారు. అనంతరం నూతనకమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా సాయిని సంతోష్, అధ్యక్షుడుగా గద్దెలపల్లి వెంకటేశ్వర్లు, ఉపా ధ్యక్షులుగా శైలేష్, ముత్యాలప్రదీప్, కార్యదర్శిగా శ్రీనాథ్, సహాయకార్యదర్శిగా రాజశేఖర్, సంతోష్, కె సంతోష్, కోశాధికా రిగా సతీష్, ప్రచారకర్తగా శ్రీధర్, సలహాసమితీ కన్వీనర్‌గా వేణుగోపాల్, శ్రీనివాస్, మహిళాఅధ్యక్షురాలిగా జ్యోతిని ఎన్నుకున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

దహెగాం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోనెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని కాంగ్రెస్‌పార్టీ సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావిశ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండలంలోనికోత్మీర్ గ్రామంలో గ్రామస్థులతో మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరుకు కృషిచేస్తామన్నారు. ధరణిలో జరిగిన తప్పిదాలను భూమాతద్వారా పరిష్కరిస్తామన్నారు. అదేవిధంగా గ్రామాల్లో అంతర్గత రోడ్లు, డ్రైనేజీలు పూర్తయ్యేలా కృషిచేస్తామన్నారు. నాయకులు తిరుపతి, వెంకటేష్, భీమన్న కృష్ణమూర్తి, శంకరయ్య, లక్ష్మీపతి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు రావి శ్రీనివాస్

20వ రోజుకు చేరిన ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమగ్రశిక్షా ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న దీక్షలు ఆదివారం నాటికి 20వరోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో ఉద్యోగులు శృతిక,మోహన్, తుకారాం, నాగేష్, సంతోష్, పవన్‌కుమార్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో కూర్చున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు